క్లుప్తంగా

పక్కాగా కులగణన సర్వే


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: కులగణన సర్వే పక్కాగా చేయాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 22 సచివాలయాల పరిధిలో కులగణన సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని క్లస్టర్లలో కులగణన సర్వే ప్రారంభించని కార్యదర్శులపై చర్యలు తప్పవన్నారు. గ్రామాలలో తాగునీరు, పారిశుధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ ఆసరా సభ నేడు

డెంకాడ: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా సభ ఆదివారం నిర్వహించనున్నట్లు వైకేపీ ఏపీఎం విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. పొదుపు సంఘాల మహిళలందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు.

అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి చొక్కాకుల అప్పలనాయుడు

విజయనగరం అర్బన్: డ్రైవింగ్‌పై స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే ప్రమాదాలను నివారించగలమని జిల్లా ప్రజా రవాణాధికారి చొక్కాకుల అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన 15వ బ్యాచ్ డ్రైవర్ల శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టీసీలో అనుభవం కలిగిన డ్రైవర్లతో ఇచ్చిన శిక్షణ ఉత్తమ డ్రైవర్లను తయారు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.శ్రీనివాసరావు, శిక్షకులు డీఎస్ రాజు, సీహెచ్.వేణు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

విజయనగరం అర్బన్: జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ రూపొందించిన వార్షిక క్యాలెండర్-2024ను శనివారం స్థానిక జిల్లా కమిటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మూడున్నర దశాబ్దాలుగా జనవిజ్ఞాన వేదిక శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తోందన్నారు. వాస్తు, జ్యోతిష్యం, చిల్లంగి, బాణామతి వంటి అశాస్త్రీయమైన అంశాలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆనంద్, విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఏవీ రాజశేఖర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, షణ్ముఖరావు, పూర్వ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, డాక్టర్ రమేష్, జనార్దనరావు, ప్రసాద్ పట్నాయక్, సీరాపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు


వీరన్నదొరను సత్కరిస్తున్న ఉప ఖజానాధికారి వెంకటరావు, తదితరులు

నెల్లిమర్ల: స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పాగి వీరన్నదొరను సహచర ఉద్యోగులు శనివారం అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైన వీరన్నదొరను కార్యాలయం ఆవరణలో సత్కరించారు. కార్యక్రమంలో ఉప ఖజానాధికారి టి. వెంకటరావు, జూనియర్ అసిస్టెంట్ పద్మగౌరీ, సిబ్బంది ఎస్. లావణ్య, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

వేపాడ: ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ లబ్ధిదారులను కోరారు. హౌసింగ్‌డేలో భాగంగా మండలంలోని బొద్దాం సచివాలయంలో లబ్ధిదారులతో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని, అవసరమైన వారు వెలుగు ద్వారా రుణం తీసుకోవచ్చని చెప్పారు. హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, ఉపాధి హామీ పథకం ఏపీఓ ఆదిలక్ష్మి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన అభిమానం...


పూసపాటిరేగ: భీమిలి సభకు తరలివెళ్తున్న కార్యకర్తలు


పూసపాటిరేగ: వెల్దూరు నుంచి బయలుదేరిన కార్యకర్తలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ జిల్లా భీమిలి మండలం సంగివలస వద్ద శనివారం నిర్వహించిన 'సిద్ధం' బహిరంగ సభకు అభిమానులు పోటెత్తారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. బస్సులు, కార్లు, ట్రక్కులు, ఆటోల్లో తరలివెళ్లడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. కొంతమంది అభిమానులు ద్విచక్ర వాహనాలకు పార్టీ జెండాలు కట్టి జై జగన్.. జైజై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ వెళ్లడంతో సందడి వాతావరణం నెలకొంది.

– నెల్లిమర్ల నెట్‌వర్క్


నెల్లిమర్ల రూరల్: సిద్ధం అంటూ పిడికిలి చూపిస్తున్న గుషిణి పంచాయతీ వైఎస్సార్‌సీపీ శ్రేణులు


డెంకాడ: రఘుమండ నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు


నెల్లిమర్ల: సీఎం సభకు బయిలు దేరిన నెల్లిమర్ల నాయకులు


నెల్లిమర్ల రూరల్: వల్లూరు పంచాయతీ నుంచి బస్సులో వెళుతున్న నాయకులు

కనీస పింఛన్ రూ. 9 వేలు ఇవ్వాలి..


గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

నెల్లిమర్ల: ఈపీఎఫ్ పింఛన్‌దారులకు కనీస పింఛన్‌గా 9 వేల రూపాయలు ఇవ్వాలని ఈపీఎఫ్ పింఛన్‌దారుల సంఘ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జరజాపుపేటలో నిరసన వ్యక్తం చేస్తూ, గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా పింఛన్‌దారులు 70 లక్షల మంది ఉన్నారని.. వారికి కనీస పింఛన్‌గా 9 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. తమ డిమాండ్ నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 29,30 తేదీల్లో ఢిల్లీలో మహాధర్నా చేపట్టనున్నామని.. కార్మికులు, ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె. సింహాచలం, జి. కృష్ణ, ఎం. రాము, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

• ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయమే లక్ష్యంగా ఉత్తరాంధ్ర జిల్లా నుంచి ఎన్నికల సమర శంఖారావం పూరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం నిర్వహించిన 'సిద్ధం' సభకు విజయనగరం నియోజకవర్గం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, నియోజవర్గం నుంచి 50 బస్సులు, 70 కార్లలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వెళ్లినట్లు చెప్పారు.

వేడుకగా శ్రీనివాసుని కల్యాణం


ఉత్సవమూర్తులు

విజయనగరం టౌన్: నగరంలోని రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. మహాసామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా ఉదయం రామాయణ పారాయణం, శ్రీరామనామ భజన, సాయంత్రం స్వామివారి కల్యాణం చేపట్టారు. సూర్యసదన ఆస్థాన పండితులు డాక్టర్ పీటీజీవీ రంగాచార్యులు రామాయణంలోని బాలకాండ విశిష్టతను భక్తులకు వివరించారు. శ్రీనివాస సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయ్‌కుమార్, చెరుకూరి శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

జామి: మండలంలోని ఏ.ఆర్.పేట పంచాయతీ పుష్పగిరి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానఅర్చకులు ఫణిహారం సీతారామాచార్యులు స్వామి వారిని వివిధ పుష్పాలు, తులసీదళాలమాలలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి భక్తులతో పూజలు,అభిషేకాలు చేయించారు.

ఉపాధి శిక్షణకు ఎంపికల ప్రక్రియ వాయిదా

చీపురుపల్లి: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో భాగం వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించాల్సిన ఎంపికల ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడిందని వెలుగు ఏపీఎం ఎం.వి.రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల ప్రక్రియ తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

భగవద్గీత పఠనం మోక్షప్రదం


భగవద్గీత సారాంశం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత పఠనం మోక్ష ప్రదమని పాలకొండ ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతామందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను చదివితే జ్ఞానం, సన్మార్గంలో నడిచే అలవాటు పెంపొందుతాయన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతిఒక్కరికీ మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో నాయకులు ప్రసాద్, తదితరులు

మెరకముడిదాం: స్థానిక ఉన్నత పాఠశాలలోని 41మంది 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన ఎడ్యూటెక్ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ సభ్యుడు కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, మెరకముడిదాం పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గుర్రాజు శనివారం పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దడంతో పాటు ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టారన్నారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.అప్పలరాజు, హెచ్ఎం కోట్ల ఎల్లంనాయుడులు, ఎంపీటీసీ బోనెల గోపి, నాయకుడు లెంక భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు


విజేతలతో నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్

• నియోజకవర్గ స్థాయి విజేతలకు అభినందనలు

నెల్లిమర్ల: ఈ నెల 24 నుంచి జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. నగర పంచాయతీ పరిధి థామస్‌పేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ముగిసిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, మండల ప్రత్యేకాధికారి వి.శ్రీనివాస్, కమిషనర్ పి. బాలాజీప్రసాద్, ఎంపీడీఓ జి.రామారావు బహుమతులు అందజేశారు. పురుషుల కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటరేగ జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల, డెంకాడ, పూసపాటిరేగ జట్లు.. పురుషుల ఖోఖోలో పూసపాటిరేగ, భోగాపురం, నెల్లిమర్ల జట్లు.. మహిళల ఖోఖోలో నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం జట్లు.. పురుషుల బ్యాడ్మింటన్‌లో నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం.. మహిళల బ్యాడ్మింటన్‌లో డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం... పురుషుల వాలీబాల్‌లో భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల.. మహిళల వాలీబాల్‌లో భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల.. పురుషుల క్రికెట్‌లో పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ జట్లు విజేతలుగా నిలిచాయి. కాగా కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఖోఖో క్రీడలకు సంబంధించి ప్రథమ బహుమతి రూ. 35 వేలు, ద్వితీయ బహుమతి రూ. 15 వేలు, తృతీయ బహుమతి ఐదు వేల రూపాయలు అందజేశారు. అలాగే బ్యాడ్మింటన్‌లో ప్రథమ విజేతకు రూ. 20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు యూఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ కె.సింహాద్రి, పీడీలు, పీఈటీలు, నగర పంచాయతీ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


మయూరి కూడలి వద్ద తూర్పుకాపు సంఘ సభ్యుల ఆత్మగౌరవ దీక్ష

• తూర్పు కాపు సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్

విజయనగరం: తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంతో పాటు తూర్పు కాపు ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించాలని తూర్పు కాపు సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మయూరి కూడలి వద్ద శనివారం చేపట్టిన ఆత్మగౌరవ దీక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తూర్పు కాపులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని కోరారు. అలాగే 7 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 12 శాతానికి పెంచాలన్నారు. ఇప్పటివరకు పదవులు అనుభవించిన తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలెవ్వరూ కులస్తులకు న్యాయం చేయలేదని ఆరోపించారు. 2017 వరకు తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించారని, ఆ తర్వాత కల్పించకపోవడం దారుణమన్నారు. తమకు సరైన ప్రాధాన్యం కల్పించిన రాజకీయ పార్టీలకే రానున్న ఎన్నికల్లో మద్దతు తెలియజేస్తామని చెప్పారు. ఆత్మగౌరవ దీక్షకు జనసేన పార్టీ పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిళ్లా విజయకుమార్, తదితరులు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బెల్లాన సంతోష్‌కుమార్ నాయుడు, రాజారావు, మురళీ, బెల్లాన శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన తవుడును దగ్గరుండి 108 అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

డెంకాడ: 'సిద్ధం' బహిరంగ సభ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గరివిడి మండలం సేరిపేటకు చెందిన తెలుగు తవుడు సిద్ధం సభ నుంచి తిరిగి ఇంటికి వెళ్లేందుకు శనివారం సాయంత్రం బస్సులో వస్తూ భోజనం కోసం రఘు ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆగాడు. భోజనం ముగించుకుని రోడ్డు దాటుతుండగా.. ఓ ద్విచక్రవాహనదారుడు అతడ్ని ఢీ కొట్టాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు.


క్షతగాత్రుడికి మెరుగైన వైద్య సేవలందించాలని డాక్టర్లకు సూచిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అనంతరం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గ్రామైక్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సంఘాల పొదుపు రికార్డులు పరిశీలించి, పొదుపు నిల్వలతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపులపై ఆరా తీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సున్నా వడ్డీ రుణం, రుణమాఫీ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీలు, సీఎఫ్‌లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.